పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరాం

అర్థరహిత ఆరోపణలు చేస్తే ఊరుకోం: నార్సింగి కాంగ్రెస్ కౌన్సిలర్లు


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్‌లు, నాయకులు

మణికొండ: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని కోకాపేట, నార్సింగి, గండిపేట కౌన్సిలర్లు జి. శివారెడ్డి, పత్తి ప్రవీణ్‌కుమార్, గోపాల సునిత గణేష్‌లు అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమాలు చేశామని, వాటిని కప్పిపుచ్చుకోవటంతో పాటు డబ్బుకు ఆశపడి పార్టీ మారినట్టు మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ ఆరోపించటం సిగ్గుచేటన్నారు. నార్సింగి మున్సిపాలిటీలో శ్మశానవాటికలు, పార్కులు, ప్రజల స్థలాలను కబ్జాలకు పాల్పడింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. విల్లాలు నిర్మాణం కాకుండానే 16 విల్లాలు ఉన్నట్టు ఇంటి నెంబర్లు కేటాయించి ఓ విల్లా స్థలాన్ని కొట్టేసింది ఎవరని వారు ప్రశ్నించారు. నార్సింగి హైట్స్‌లో ఏకంగా హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో ఉన్న 1608 గజాల పార్కును అగ్రిమెంట్ చేసుకుని కబ్జాకు ఎవరు ప్రయత్నించారని వారు నిలదీశారు. ఆ విషయం రెండుసార్లు పలు పత్రికల్లో కథనాలు రావటంలో కూల్చింది నిజం కాదా అని అన్నారు. నార్సింగిలో సర్వే నెంబర్ 302, 304, 305లలో ఉన్న రెడ్డి, బలిజ, దర్జి వారి శ్మశాన వాటికకు చెందిన 1500 గజాల భూమిని కబ్జా చేసింది వాస్తవం కాదా అని నిలదీశారు. బడా బిల్డర్ల వద్ద కౌన్సిలర్లు, అధికారులు, మీడియాకు డబ్బులు ఇవ్వాలని దోచుకుంది ఎవరని వారు ప్రశ్నించారు. గోలిదొడ్డి, కోకాపేటలలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించింది ఎవరో ప్రజలకు బాగా తెలుసునని తెలిపారు. ఇప్పటికైనా తమను విమర్శించటం మానుకోవాలని, లేదంటే రాబోయే రోజుల్లో వారు చేసిన మరిన్ని అక్రమాలు, కబ్జాలను వెలుగులోకి తెస్తామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఎ.దుర్గేష్‌యాదవ్, ఉషారాణి, నాయకులు మైలారం శ్రీనివాస్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు!

- అనుమతులు లేకుండానే ఏర్పాట్లు
- గజాల చొప్పున కాకుండా గుంటల లెక్కన విక్రయాలు
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులు


గొల్లపల్లి సర్వేనంబరు 256లో చేపడుతున్న అక్రమ వెంచరు


వెంచరు ముందు ఏర్పాటు చేస్తున్న ఆర్చి

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జీవో 111 నిబంధనల మేరకు పట్టణంలో వెంచర్ల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేకున్నా అక్రమార్కులు మాత్రం వారి కార్యకలాపాలను సాఫీగా సాగిచ్చేస్తున్నారు. పట్టణంలోని గొల్లపల్లి రెవెన్యూ 256లో 14 ఎకరాల విస్తీర్ణంలో అక్రమ వెంచరు ఏర్పాటు చేసి యథేచ్ఛగా ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారు. దీనిని స్థానికంగా మున్సిపాలిటీ పట్టణ ప్రణాళికా విభాగం, హెచ్‌ఎండీఏ విభాగాలు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

పనిచేయని టాస్క్‌ఫోర్స్...

గతంలో అక్రమ వెంచర్లు, అక్రమ కట్టడాలను నియంత్రించడానికి హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిపి టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశారు. ఐదేళ్ల కాలంలో టాస్క్‌ఫోర్సు ఒక్కటంటే ఒక్కదానికి కూడా నియంత్రించిన దాఖలాలు లేవు. అప్పటి టాస్క్ ఫోర్సుకు ప్రస్తుతం కనీసం ఉనికి కూడా లేదు. దీంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తమ పనులు చకచకా కానిచ్చేస్తున్నారు.

గుంటల లెక్కన...

మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం మొదటి రిజిస్ట్రేషన్‌లకు మినహా అక్రమ లేఅవుట్‌లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లను పూర్తిగా రద్దు చేసింది. అవే నిబంధనలు నేటికి కొనసాగుతున్నాయి. దీంతో గత మూడేళ్లుగా అక్రమార్కులు రూటు మార్చారు. అమ్మకాలు గజాల చొప్పున చేస్తున్నప్పటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాత్రం గుంటల లెక్కన రెవెన్యూ కార్యాలయంలో చేపడుతున్నారు. ప్లాట్లను గుంటల లెక్కన విక్రయిస్తున్న ఈ విధానంపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో అక్రమార్కుల పని కాస్తా మరింత సులువుగా మారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో గత మూడేళ్లుగా సుమారు పదిహేను వెంచర్లలో ఇలా గుంటల లెక్కన మాత్రమే భూముల విక్రయాలు జరిగాయి. అక్రమ వెంచర్లను అడ్డుకోకపోవడంతో పలు సందర్భాల్లో వాటిని కొనుగోలు చేసిన విక్రయదారులు కూడా ఇబ్బందులు పడుతున్న సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అక్రమ వెంచర్లపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లెక్కలేనన్ని అక్రమ వెంచర్లు...



పట్టణంలోని లెక్కలేనన్ని అక్రమ వెంచర్ల పనులు జోరుగా సాగుతున్నాయి. అయినా అధికారులు ఏమాత్రం వాటిని నియంత్రించడం లేదు. అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోళ్లు చేస్తున్న ప్రజలు అనేకమార్లు ఇబ్బందులు పడుతున్నారు. గజాల చొప్పున డబ్బులు తీసుకుంటున్న విక్రయదారులు మాత్రం గుంటల లెక్కన భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీంతో రెవెన్యూలో కూడా భూమి మార్పిడి చేయకుండా వెంచర్లు జరిగిపోతున్నాయి. దీనిపై లోతుగా విచారణ చేపట్టి అడ్డుకోవాలి

వై. కుమార్
– శంషాబాద్ 6 వార్డు కౌన్సిలర్

తెలంగాణ దళితబంధు రాష్ట్ర కార్యదర్శిగా ఉదయ్ కుమార్


గుర్రంపల్లి ఉదయ్ కుమార్ శ్యామల్‌రాజు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన గుర్రంపల్లి ఉదయ్ కుమార్ శ్యామల్‌రాజు తెలంగాణ దళిత బంధు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బచ్చలకూర బాలరాజు నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్య నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్

శంషాబాద్: పట్టణంలోని మినీస్టేడియంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. హిమబిందు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 20 నుంచి 30 వరకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దోస్త్ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజేంద్రనగర్ అని ఉంటుందన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు 9441956233, 9494812040 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'మనూ'లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పలు కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు ఉర్దూ విభాగాధిపతి ప్రొఫెసర్ షంషుల్ హోడా ఆదివారం తెలిపారు. కొత్త విద్యాసంవత్సరానికి ఉర్దూ(ఎంఏ)లో 2024–25 అడ్మిషన్లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఉర్దూ భాష లేదా మాధ్యమంతో యూజీలో ఏదైనా గ్రాడ్యుయేట్‌లకు ఈ కోర్సుకు అర్హులుగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మనూ హైదరాబాద్ క్యాంపస్‌లో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 9494440782లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎంతస్థాయికి ఎదిగినా పునాదులు మాత్రం పాఠశాలల్లోనే


పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరుపుకున్న ఎంబీ హై స్కూల్ 2004 పదో తరగతి విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శంషాబాద్: పట్టణంలోని ఎంబీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. 2004 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాల రోజులు జీవితంలో ఒకసారి మాత్రమే వస్తాయని అవి ఎప్పటికీ గుర్తిండిపోతాయన్నారు. అంతేకాకుండా జీవితంలో ఎంత స్థాయికి ఎదిగినా పునాదులు మాత్రం పాఠశాలలోనే పడతాయన్నారు. అనంతరం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడపడంతో పాటు వారి స్థితిగతులు, వారు చేస్తున్న ఉద్యోగాల గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు చదువుతున్న రోజుల్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, సందీప్ పాల్గొన్నారు.

కోట మైసమ్మ దేవాలయ కమిటీ సమావేశం


దేవాలయంలో సమావేశమైన ఆలయ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని కోట మైసమ్మ దేవాలయ ఆవరణలో దేవాలయ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో దేవాలయ నిర్వహణ, పూజా కార్యక్రమాలు తదితర వాటిపై చర్చించారు. దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలుగకుండా చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర వాటిపై సభ్యులతో సూచనలు, సలహాలు చేశారు. దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు తదితర వాటిపై సమావేశంలో చర్చించి ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందన్‌గౌడ్, ఎలుకల పెంటయ్య, మజ్జిగ అశోక్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, కేశవులు, అంజయ్య, అల్లాడి దేవదాస్ గౌడ్, దొడ్ల రాములు, సత్యనారాయణగౌడ్, వినయ్‌గౌడ్, వినోద్‌చారి, శేఖర్ బాబు, రాఘవేందర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, నాగేండ్ల శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బర్మా దేశస్థుడు మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో బర్మా దేశస్థుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మౌనిక వివరాల ప్రకారం... బర్మా దేశానికి చెందిన ఇస్లాం (35), అబ్దుల్లా (30)లు నగరానికి వలస వచ్చి బాలాపూర్ ప్రాంతంలో ఉంటూ సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. టోలిచౌకి ప్రాంతంలో శనివారం రాత్రి సెంట్రింగ్ పనులు ఉండటంతో ద్విచక్ర వాహనంపై బాలాపూర్ నుంచి ఆరాంఘర్ మీదుగా ప్రయాణమయ్యారు. అత్తాపూర్ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇస్లాంకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన అబ్దుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సుందరయ్య వర్ధంతి


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గోల్కొండ: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం నాయకులు ఆదివారం నిర్వహించారు. గుడిమల్కాపూర్‌లోని బొజ్జగుట్టలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ని తరాలు మారినా సుందరయ్య జీవితం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాంపల్లి జోన్ కన్వీనర్ సి.మల్లేశ్, శంకర్, ఎం.యాదయ్య, సీహెచ్.వెంకటస్వామి, శ్రీనివాస్, రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

నాంచారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

గోల్కొండ: ఈ నెల 23 న జరగనున్న ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జాతరకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే బడ్జెట్‌లో ఎరుకల అభ్యున్నతికి నిధులు కేటాయించాలని సీఎంను కోరుతానని పేర్కొన్నారు. ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుతాడి కుమార్, ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ, జిల్లా నాయకులు, ప్రతినిధులు ఉన్నారు.

మజ్లిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషాఖాద్రీ

గోల్కొండ: కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆధ్వర్యంలో టోలిచౌకీ హకీంపేట్‌లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే, జాతీయ ప్రధాన కార్యదర్శి అహ్మద్‌పాషాఖాద్రీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి నెలకొనాలని, పార్లమెంట్ ఎన్నికల్లో మజ్లిస్ విజయం సాధించాలని ప్రార్థనలు చేశామన్నారు. ఆల్ ఇండియా కిరత్ కమిటీ అధ్యక్షుడు, కుతుబ్‌షాహీ ఈద్గా ఖతీబ్ మౌలానా కారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం మన దేశం చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ నాయకులు హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్‌పటాన్ తదితరులు ఉన్నారు.

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని భారత రత్న కర్పూరి ఠాకూర్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కన్వీనర్ సూర్యనారాయణ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని కోరుతూ సీఎం కలుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి టి.గోపాల్ సింగ్ చేతుల మీదుగా ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్ దంపతులు, ప్రమోషన్ పొందిన ఏసీపీ సురేశ్, వినోద్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రభాకర్, మురళీమోహన్, లక్ష్మణ్ రావు, భవాని శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

26న ఉచిత వైద్య శిబిరం

చార్మినార్: పాత నగర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉచిత మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్‌తో పాటు ఐ శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు తెలిపారు. ఆదివారం ఉదయం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రుల సహకారంతో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌లోని సాయి క్రుప వసంత బంకెట్ హాల్‌లో శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. జనరల్ హెల్త్ చెకప్, కార్డియాలజీ చెకప్, కంటి పరీక్షలు, స్కిన్ కాస్మొటిక్ స్క్రీనింగ్ టెస్ట్, డయాబెటిక్ చెకప్, 2డీ ఏకో, ఈసీజీ, బీపీతో పాటు దంత, బీఎండీ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బిట్ల హన్స్‌రాజ్, ఉపాధ్యక్షులు దేవరశెట్టి ప్రభాకర్, పల్లె శ్రావణ్, పూస కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి కాసారపు చంద్రకుమార్, కార్యదర్శి కటిక శ్రీధర్, కోశాధికారి మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దళారుల దగా..!

- ఒకవైపు వర్షాలు, మరోవైపు మద్దతు ధర లేక రైతన్న దిగాలు
- కొనుగోలు కేంద్రాలు లేక దళారుల చేతిలో నష్టపోతున్న రైతులు
- క్వింటాల్‌కు రూ. 500ల నుంచి రూ. 600 వరకు నష్టం


మల్కారంలో కుప్పగా పోసిన వరి ధాన్యం

శంషాబాద్ రూరల్: మద్దతు ధర లేక రైతులు దళారుల చేతిలో దగా పడుతున్నారు. ఒకవైపు అకాల వర్షాలు కురుస్తుండటం.. మరోవైపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో రోడ్లపై, కల్లాలలో పోసిన ధాన్యం ఎక్కడ వర్షానికి తడుస్తుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు క్వింటాల్ ధాన్యాన్ని సుమారు రూ. 500 నుంచి రూ.600 తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక రైతులు దళారులకు విక్రయిస్తూ మోసపోతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు రబీలో సుమారు 2,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం వరి కోతలు పూర్తి కావస్తుండగా ధాన్యానికి మద్దతు ధర దొరకక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస మద్దతు ధర సాధారణ రకానికి రూ.2183, ఏ గ్రేడ్ రకానికి రూ.2203 ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో దళారులు క్వింటాలుకు రూ.1600 నుంచి రూ.1700 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ లెక్కన క్వింటాలు ధాన్యానికి రైతులు రూ.500–రూ.600 వరకు నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక..

మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. పాల్మాకుల, మల్కారం సొసైటీల్లో ప్రతిసారి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ రబీ సీజన్‌లో మాత్రం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో స్థానిక రైసు మిల్లుల యజమానులు, దళారులు రైతులను దోచుకుంటున్నారు.

మార్కెట్‌లో ధరల వ్యత్యాసం..

ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం ధరలకు బహిరంగ మార్కెట్‌లో చాలా వ్యత్యాసం నెలకొంది. గత ఖరీఫ్‌లో మద్దతు ధర కంటే కూడా అదనంగా రూ.500 ఎక్కువ ధరకు రైతులు ధాన్యం అమ్ముకున్నారు. దీంతో లాభసాటిగా ఉండడంతో రైతులు రబీలో వరి సాగు విస్తీర్ణం పెంచారు. ఇదే సమయంలో మార్కెట్‌లో ధరలు పడిపోయి రైతులు నష్టపోతున్నారు.

వర్షాలతో మరింత నష్టాలు..

వరి కోతల సమయంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు మరింత నష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ధరలు పెరుగుతాయనే ఆశతో ధాన్యాన్ని ఇళ్లు, పొలాల వద్ద కుప్పలు పోసి పెట్టుకున్న రైతులకు నిరాశ ఎదురవుతుంది. వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్వింటాలుకు రూ.500 నష్టం..

నేను ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాను. కొంత ధాన్యాన్ని ఇంటి అవసరాల కోసం పెట్టుకున్నాను. మిగిలిన ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1700లకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ లెక్కన క్వింటాలుకు రూ.500 వరకు నష్టం జరిగింది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రైతులను దోచుకుంటున్నారు.

సురేందర్‌రెడ్డి,
రైతు, మల్కారం.

సాహిత్యంలో నిష్పాక్షిక విమర్శ పెరగాలి

సుల్తాన్‌బజార్: తెలుగు సాహిత్య విమర్శలో నిష్పాక్షమైన విశ్లేషణ పెరగాలని వక్తలు పేర్కొన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత్ పరిషత్ కళామందిరంలో సాహిత్య విమర్శ అధ్యాయన శిబిరం ఆదివారం జరిగింది. తెలంగాణ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు విమర్శకులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రాచీన కాలం నుంచి తెలుగు భాష, సాహిత్య పరిణామ వికాసాల్లో సాహిత్య విమర్శ ఎంతో ప్రాధాన్యం వహించిందన్నారు. ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య ఎస్వీ రామారావు మాట్లాడుతూ 1875వ సంవత్సరంలో కందుకూరి వీరేశలింగం రచించిన విగ్రహ తంత్ర విమర్శనం అనేది మొట్టమొదటి విమర్శ గ్రంథమన్నారు. విమర్శలతోనే నాణ్యమైన సాహిత్యం లభిస్తుందన్నారు. ప్రాచీన సాహిత్యంలో విమర్శ పలు రూపాల్లో ఉందని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మానస చెన్నప్ప వివరించారు. విమర్శ, వ్యాఖ్యానం, సమీక్ష, సాహిత్య చరిత్ర పరిశోధనల మధ్య వేద సాదృశ్యాలపై తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.



కనువిందు.. నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన కళాకారులు విశ్వశిఖర నాట్యాలయ మీనా, కృష్ణప్రియ శిష్యబృందం భరతనాట్య అలరించింది. ఇందులో పుష్పాంజలి, గణేశ కీర్తనం, చంద్రచూడ, దేవికౌత్వం, మాడు మొకుమ్ కన్నా, పరమ పురుషుడ, కళింగ నర్తన తిల్లాన, అదిగో అల్లదిగో, శివతాండవం, విష్ణుకౌత్వం, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు శ్రీనిధి, సుప్రజ, ధృతి, వర్ష, దేశికశ్రీ, రిషిక, నిరుపమ, ఐశ్వర్య, లోగిత, హరిణి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

యాకుత్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి గల రంగాల్లోనూ రాణించాలని ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం. రాజేశ్ యాదవ్ సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల చదువులకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో క్రీడలకు అంతే ఇవ్వాలని కోరారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన పాత బస్తీకి చెందిన పలువురు క్రీడాకారులు కరిష్మా రాణి షిండే, వైష్ణవి, అఖిల్‌రాజ్, పునీత్, ఆర్యాన్‌ను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి మెమోంట్‌లు అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ ప్రదీప్, సభ్యులు ఇషాక్ ఖురేషి, విష్ణు వర్ధన్, శశి తదితరులు పాల్గొన్నారు.